సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



ఎల్లమ్మ బోనాలు

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. బైండ్ల కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



ఉమా మహేశ్వర కల్యాణం

గంభీరావుపేట: మండల కేంద్రంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో ఉమా మహేశ్వర కల్యాణం నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గి ఉక్కపోతగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హనుమాన్ జయంతి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీహనుమాన్ ఆలయంలో ఈనెల 12న నిర్వహించే జయంతి, రథోత్సవాల ఉత్సవాల వాల్ పోస్టర్‌ను మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆలయ ఈవో నాగరపు శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త గొరిశెట్టి మహేందర్, మాజీ ధర్మకర్త చేపూరి నాగరాజు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురైతే షీ టీంకు ఫిర్యాదు చేయండి

సిరిసిల్ల క్రైం: మహిళలు వేధింపులకు గురైతే షీ టీంలకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ మహేశ్ బి గీతే అన్నారు. జిల్లాలోని విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తూ సేవలందిస్తున్నట్లు తెలిపారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో మహిళలను వేధిస్తున్న వారిపై 2 కేసులు, 7 పెట్టి కేసులు నమోదు చేశామని అన్నారు. వేధింపులకు గురైతే వెంటనే 87126 56425 ఫిర్యాదు చేయాల సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వరూపరెడ్డి

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం శివారులోని సర్దాపూర్ మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏఎంసీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపరెడ్డి ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320తో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దుబాల వెంకటేశం, ఆడెపు జగన్, వెల్ముల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల రక్షణకు పోరాటం



పోలీసులు అదుపులో నాయకులు

ఇల్లంతకుంట: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ అన్నారు. మంగళవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకొని వదిలి పెట్టిన అనంతరం వారు మాట్లాడారు. తమను అదుపులోకి తీసుకొని వదిలేయడం ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపోరాట నాయకులపై నిర్బంధం పెరిగిందన్నారు. ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనపై దృష్టి సారించాలని కోరారు.



నెమలి వాహనంపై విహారం

రాజన్న ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నెమలి వాహనంపై ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

– వేములవాడ

ఆహ్లాదం కరువాయే..

- కనుమరుగైన పచ్చదనం
- విరిగిన ఆట వస్తువులు
- సిరిసిల్లలో బోసిపోతున్న పార్కులు

గ్రౌండ్ రిపోర్ట్



- ఇది కొత్తచెరువు మినీట్యాంక్‌బండ్. చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు దఫాల్లో రూ.15కోట్లకు పైగా వెచ్చించింది. పిల్లలు ఆడుకునే ఆటవస్తువులు ఏర్పాటు చేసింది. నిర్వహణలోపంతో పనికిరాకుండా పోయాయి. పచ్చదనం కనుమరుగైంది. కొత్తచెరువు ఇలా కళావిహీనంగా మారింది.



కొత్తచెరువుపై మినీట్యాంక్‌బండ్‌లో పాడయిన పరికరాలు



- జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్. వాటర్ ఫౌంటేన్స్, పిల్లల ఆటవస్తువులు, పచ్చదనంతో కనిపించే ఈ పార్క్ నిర్వహణ లేక ఏడాదిగా బోసిపోతోంది. మానేరు తీరానికి సమీపంలో ఉండే ఈ పార్క్‌కు నిత్యం వందల కొద్దీ సందర్శకులు వస్తుంటారు. ఇప్పుడు పార్కులో పాడుబడిన ఆటవస్తువులు, పచ్చదనం లేక సందర్శకుల సందడి తగ్గింది.



- ఈ చిత్రాలు వెంకట్రావునగర్ పార్కులోనివి. స్మార్ట్‌సిటీలో భాగంగా ఎనిమిదేళ్ల క్రితం ఈ పార్క్‌ను రూ.60లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం ఆటవస్తువులు విరిగిపోయాయి. ఓపెన్‌జిమ్ పరికరాలు పనికి రాకుండా పోయాయి. వాటర్‌ఫౌంటేన్ కళావిహీనంగా మారింది.

పార్కుల వివరాలు

కొత్తచెరువు	రూ.15కోట్లు
వెంకట్రావునగర్ పార్క్	రూ.60లక్షలు
నెహ్రూపార్క్	రూ.90లక్షలు
శివనగర్ పార్క్	రూ.40లక్షలు
అంబికానగర్ పార్క్	రూ.50లక్షలు
ఇందిరాపార్క్	రూ.80లక్షలు
గణేశ్‌నగర్ పార్క్	రూ.50లక్షలు
టీఆర్‌నగర్ పార్క్	రూ.13లక్షలు
పద్మనగర్ పార్క్	రూ.15లక్షలు
యాదాద్రి డెన్స్ పార్క్	రూ.10లక్షలు
అర్బన్ ఫారెస్టు పార్క్	రూ.1.38లక్షలు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం వాసులకు ఆహ్లాదం కరువైంది. సిరిసిల్లలోని పార్కుల నిర్వహణ సరిగా లేక పచ్చదనం కరువైంది. ఆట వస్తువులు విరిగిపోయాయి. కొత్తచెరువులో ఏర్పాటు చేసిన బోటింగ్ అసలుకే ప్రారంభం కాలేదు. ఇన్నాళ్లు పచ్చగా కని పించిన నెహ్రూపార్క్ సైతం సందర్శకులు లేక బో సిపోతోంది. సిరిసిల్ల పట్టణంలో గత ప్రభుత్వం హ యాంలో రూ.15కోట్లతో మినీ ట్యాంకుబండ్, రూ. 5.46కోట్లతో 10 పార్కులు, రూ.2.15కోట్లతో 6 ప్రధాన కూడళ్లు, సుమారు రూ. 10కోట్లతో ప ట్టణంలోని ప్రధాన రహదారులను విస్తరించారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో పార్కులు బోసిపోతున్నా యి. చిన్న పిల్లలు ఆడుకునే వస్తువులను సై తం మరమ్మతు చేయించకపోవడంపై స్థానికులు ము న్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పార్కులపై శ్రద్ధ పెడుతున్నాం



సిరిసిల్లలోని పార్కుల నిర్వహణపై ప్రణాళికాబద్ధంగా నడుచుకుంటున్నాం. గ్రీనరీ కార్మికులతో హరిత సిరిసిల్ల లక్ష్యాన్ని పాడుకానివ్వం. అన్ని పార్కులు, డివైడర్లు, జంక్షన్లలోని మొక్కలకు నీరుపోయిస్తున్నాం. పార్కుల్లో గ్రీనరీ, ఆహ్లాదాన్ని పెంచడానికి, ఆట వస్తువుల మరమ్మతుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. ఉద్యానవనాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

– ఎస్.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

సన్నబియ్యం మానసిక సంతోషాన్ని ఇచ్చింది



సిరిసిల్లలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- ఇది దేశంలోనే ప్రథమం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, కానీ కొన్ని పథకాలు మానసికంగా ఎంతో సంతోషాన్ని ఇస్తాయని, పేదలకు సన్నబియ్యం ఇవ్వడం మానసికంగా సంతోషాన్ని ఇచ్చిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిరిసిల్ల కొత్త బస్టాండు సమీపంలోని ఇందిరానగర్ రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీకి మంగళవారం శ్రీకారం చుట్టారు. దేశంలోనే తొలి మనరాష్ట్రంలో పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 17,263 రేషన్‌షాపుల్లో సన్నబియ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. మహిళామణులను కోటీశ్వరులుగా చేయాలని సదుద్దేశంతో ఇప్పటికే ఇందిరా మహిళా శక్తి కింద వివిధ యూనిట్లు ప్రారంభించామని అన్నారు. అలాగే సోలార్ యూనిట్లు మహిళా సంఘాలకు బస్సులు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. సన్న వడ్లు పండించే రైతులకు ప్రతీ క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస మాట్లాడుతూ జిల్లాలోని 345 రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి గీతే, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో రాధాబాయి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపారెడ్డి, డీఎస్‌వో వసంతలక్ష్మీ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రజిత, కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, సూర దేవరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వస్త్రోత్పత్తిదారులు

సిరిసిల్లకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వస్త్రోత్పత్తిదారులు కలిసి విద్యుత్ బిల్లుల సమస్యను వివరించారు. 'సెస్' అధికారులు బ్యాక్ బిల్లింగ్ పేరిట కరెంట్ బిల్లులు విధించారని, 126 కార్ఖానాలు మూతపడ్డాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, ప్రతినిధులు గోవిందు రవి, పద్మశాలీ సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటై అడ్డంకులు

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటై రాష్ట్రంలో ప్రజాపాలనకు అడ్డంకులు సృష్టిస్తున్నాయని, ఆ రెండు పార్టీలు కవలపిల్లలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి సంబంధం లేని గోపనపల్లి, కంచ శివారుల్లోని 400 ఎకరాల ప్రభుత్వ భూములను అభివృద్ధి చేస్తుంటే.. విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారని ఆరోపించారు.

రూ.10వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం

- అర్హులందరికీ అవకాశం కల్పించాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రూ.10వేల కోట్లతో రాజీవ్ యువవికాసం పథకానికి రూపకల్పన చేసిందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇచ్చిన శిక్షణలో మాట్లాడారు. జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్క యువకుడికి అవకాశం కల్పించాలన్నారు. మండలాల్లోని తహసీల్దార్లు కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎంపీడీవో, మున్సిపల్ ఆఫీస్‌ల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. గడువులోగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి మండల్ లెవెల్ కమిటీకి పంపిస్తారని వివరించారు. ఆ కమిటీ పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత జిల్లా కమిటీకి పంపిస్తారని వెల్లడించారు. అనంతరం అర్హులు ఎంపిక చేసుకున్న రుణాలకు సంబంధించిన శిక్షణను అందజేస్తారని తెలిపారు. ఈ పథకంపై ప్రచారం కల్పించి అర్హులకు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, ఆర్డీవో రాధాబాయి, డీఆర్‌డీవో శేషాద్రి, మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి భారతి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజమనోహన్‌రావు, జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కూలీ రేట్లు నిర్ణయించాలని..



సిరిసిల్ల నేతన్న చౌక్‌లో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

- సిరిసిల్లలో రోడ్డెక్కిన నేతన్నలు
- వస్త్రోత్పత్తి బంద్ చేసి నేతన్నల ఆందోళన
- యారన్ సబ్సిడీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో నేత కార్మికులు (పవర్ లూమ్) వస్త్రోత్పత్తిని బంద్ చేసి మంగళవారం రోడ్డెక్కారు. ప్రభుత్వం ఇచ్చిన మహిళా శక్తి చీరల ఉత్పత్తి ఆర్డర్లకు నేత కార్మికులకు చెల్లించే కూలి నిర్ణయించాలని, 2023 నాటి బతుకమ్మ చీరలకు చెల్లించాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ సొమ్మును చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పవర్‌లూమ్ కార్మికులు ఆందోళనకు దిగారు. సిరిసిల్ల బీవై నగర్ నుంచి నేతన్న చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిరిసిల్లలో పాలిస్టర్ వస్త్రాన్ని ఉత్పత్తి చేసే కార్మికులకు ఒప్పందం ప్రకారం కూలీ చెల్లించాలని, వర్కర్ టూ ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి చేసి కార్మికులను యజమానులను చేయాలని, ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న మహిళా శక్తి చీరలకు సంబంధించిన పవర్‌లూమ్ వార్పిన్, వైపని కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు డిమాండ్లతో నేతకార్మికులు సాంచాలను బంద్ చేసి రోడ్డెక్కి నిరసన తెలిపారు. నేత కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేదాకా.. వస్త్రోత్పత్తిని నిలిపివేస్తామని, సాంచాలు(పవర్‌లూమ్స్) నడుపమని స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షులు కోడం రమణ, కార్మికులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించండి




మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న అర్చకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తిమ్మాపూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తిశర్మ మాట్లాడుతూ ఆలయాల్లో పూజలు చేసే ధూపదీప నైవేద్య అర్చకులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నార అన్నారు. తమ సమస్యల పరిష్కారంపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాచర్ల పార్థసారథిశర్మ, ప్రధాన కార్యదర్శి పరాంకుశం రమేశ్, కోశాధికారి కేవీఆర్ వెంకటారమణాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల రవికుమార్, ప్రచార కార్యదర్శి చర్లపల్లి సీతారాములుశర్మ, గౌరవ సలహాదారు పారునంది ఆంజనేయశర్మ తదితరులు ఉన్నారు.

వానరానికి నీటి కష్టాలు

సిరిసిల్ల పట్టణంలోని ప్రగతినగర్‌లో ఓ కోతి దాహంతో అల్లాడిపోయింది. అసలే ఎండా కాలం.. ఎండలు మండిపోతున్నాయి. నీళ్ల లేక కోతి గొంతు ఎండిపోతుంది. నీటి కోసం ఇల్లుల్లూ తిరుగుతూ ప్రగతినగర్‌లోని ఓ ఇంట్లో డ్రమ్ము నిండా నీరు ఉండడంతో గబుక్కున అక్కడికి వెళ్లి డ్రమ్ములో మూతిపెట్టిన గటాగటా నీళ్లు తాగి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది.

– సిరిసిల్ల





'ఉపాధి' భరోసా కరువు

'ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన మానస జాబ్‌కార్డు కోసం రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకుంది. కొద్ది రోజుల తర్వాత జాబ్‌కార్డు వచ్చిందని పంచాయతీ అధికారి చెప్పడంతో గతేడాది వేసవిలో నాలుగు రోజులు ఉపాధిహామీలో చేపట్టిన కాల్వ పనులకు వెళ్లింది. కానీ ఆ డబ్బులు ఇప్పటి వరకు రాకపోగా.. అసలు జాబ్‌కార్డు మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు. చేసిన శ్రమ వృథా కావడంతోపాటు జాబ్‌కార్డు మంజూరు కాలేదు.'

'ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన పూదరి సతీశ్ గతేడాది వేసవిలో ఉపాధి హామీలో చేపట్టిన కాల్వ పూడికతీత పనులకు వెళ్లాడు. వారానికి పైగా కాల్వ పనులు చేశాడు. ఏడాది గడుస్తున్నా డబ్బులు తన ఖాతాలో జమకాలేదు. డబ్బుల కోసం పంచాయతీలోని ఉపాధిహామీ సిబ్బందిని అడిగినా డబ్బులు రావడం లేదు.

- పనిచేసినా అందని వేతనాలు
- పనులు లేక దిక్కులు చూస్తున్న కూలీలు
- కొత్త జాబ్‌కార్డుల ఊసే లేదు
- పట్టించుకోని అధికారులు



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామాల్లో వలసల నివారణ, పేదలకు ఉన్న ఊరిలోనే పని చూపెట్టి.. ఆర్థికంగా స్థిరత్వం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పథకం ఉద్దేశం అమలు కావడం లేదు. పనిచేసినా పైసలు రాకపోగా.. పనిచేద్దామని జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు కావడం లేదు. ఈ విషయమై ఉపాధిహామీ అధికారులను అడిగినా సమాధానం రావడం లేదు. దీంతో చేసేదేమి లేక జిల్లాలోని చాలా మంది కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటున్నారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం అమలుపై 'సాక్షి' ఫోకస్.

కార్డుల సంఖ్యను మించని కూలీలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 255 గ్రామాల్లో 98,130 జాబ్‌కార్డులు ఉన్నాయి. కొత్తగా జాబ్‌కార్డుల కోసం 56 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇంత కుమించి దరఖాస్తు చేసుకున్నా అధికారుల రికార్డుల్లో నమోదు కాలేవని క్షేత్రస్థాయిలో తెలుస్తోంది. జిల్లాలో గతేడాది కాలంగా జిల్లా వ్యాప్తంగా 51,088 కుటుంబాలకు ఉపాధిహామీ పనులు కల్పించారు. ఆయా కుటుంబాల్లోని 75,756 మంది కూలీలు 21,88,092 పని దినాలకు హాజరయ్యారు. అయితే ఉపాధి పనులకు హాజరైన కూలీల సంఖ్య జాబ్‌కార్డుల సంఖ్యను మించకపోవడం గమనార్హం. గ్రామాల్లో పని కావాలని కూలీలు ఎదురుచూస్తున్నా పనులు చూపెట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

గ్రామాల్లో పని లేక అడ్డా కూలీలుగా..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఉపాధి దొరక్క చాలా మంది కూలీలు సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని భవన నిర్మాణ పనులకు వెళ్తున్నారు. నిత్యం ఉదయం సిరిసిల్ల, వేములవాడల్లోని లేబర్ అడ్డాలను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తోంది. సిరిసిల్ల నుంచి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలోని గ్రామాల నుంచి కూడా కూలీలు ఉదయమే వెళ్తున్నారంటే గ్రామాల్లో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. తెల్లవారుజామునే సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని లేబర్ అడ్డాలకు చేరుకుంటున్న కూలీల్లో కొందరికి మాత్రమే పనులు దొరుకుతున్నాయి. పని దొరకని వారు ఉసూరుమంటూ ఇళ్లకు తిరిగివస్తున్నారు. ఇలా ఆ రోజు తమ రవాణా ఖర్చులు భరించాల్సిందే. పని దొరక్కపోగా.. ఆటో, బస్సు చార్జీలు భరించడం కూలీలకు భారంగా మారుతోంది.

జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది కొత్తగా జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా జాబ్‌కార్డులు రాలేదని సమాచారం. దీంతో వారు ఉపాధిహామీ పనులకు వెళ్లలేకపోతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా చాలా తక్కువ సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చినట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మూడు, నాలుగు రెట్లు అదనంగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. తక్కువకు తక్కువ గ్రామానికో దరఖాస్తు వచ్చినా 255 దరఖాస్తులు ఉంటాయి. కానీ అధికారులు మాత్రం చాలా తక్కువ చెబుతున్నారు.

ఉపాధికార్డుల వివరాలు

మొత్తం జాబ్‌కార్డులు	98,130
జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులు	56
పనిచేసిన కుటుంబాలు	51,088
పనిచేసిన కూలీలు	75,756
కల్పించిన పనిదినాలు	21,88,092

త్వరలోనే వస్తాయి



జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త ఆర్థిక సంవత్సరంలో మంజూరవుతాయి. మూడు, నాలుగు వారాల వేతనాలు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. కొందరికి ఆధార్‌నంబర్ మ్యాచ్ కాకపోవడంతోనే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంటాయి. వారివి కూడా పరిష్కరిస్తాం.

– కొమురయ్య, ఏపీవో, ఎల్లారెడ్డిపేట

పోచమ్మతండాకు తాగునీరు



పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గుండారం గ్రామపంచాయతీ పరిధి పోచమ్మ తండా వాసుల తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. పోచమ్మతండాకు తాగునీరు సరఫరా కాకపోవడంతో తండావాసులు సోమ, మంగళవారాల్లో నిరసన తెలిపారు. ఈనేపథ్యంలో 'సాక్షి'లో 'తండాలో తాగునీటి తండ్లాట' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. తాగునీటి కష్టాలు దూరమయ్యేలా చేసిన 'సాక్షి'కి తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీ కాలువలో గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని ఎస్సారెస్పీ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సుగల వ్యక్తి శరీరంపై బ్రౌన్ కలర్ ఫార్మల్ పాయింట్, మెరూన్, నలుపు రంగు పొడుగు గీతలు, ఫుల్ హ్యాండ్స్ చొక్కా ఉందని రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు.

వీవింగ్ మిల్లు కార్మికుడి మృతి


బోకం నాయుడు (ఫైల్)

రామగుండం: అంతర్గాం టీటీఎస్ కాలనీకి చెందిన వీవింగ్ మిల్లు కార్మికుడు బోకం నాయుడు (60) మంగళవారం మృతి చెందాడు. వీవింగ్ మిల్లు నుంచి ప్రయోజనాలకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉంది. ఆ సొమ్ము చూడకుండానే నాయకుడు మృతి చెందాడు. ఇప్పటికే పదుల సంఖ్యలో కార్మికులు బకాయిలు పొందకుండానే మృతి చెందారు. ప్రభుత్వం ఇప్పటికై నా స్పందించి తక్షణమే బకాయిలను చెల్లించాలని బర్మా, కాందీశీకుల సంఘం ప్రతినిధులు జమ్ముల రామారావు, ఇండిబిల్లి రవీందర్ కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో కౌలురైతు..


ప్రశాంత్ (ఫైల్)

గంగాధర(చొప్పదండి): మండలంలోని కురిక్యాల గ్రామానికి చెందిన కౌలురైతు ఒగ్గరి ప్రశాంత్(38) విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ప్రశాంత్ గ్రామంలోనే మూడెకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని వరి పంటసాగు చేస్తున్నాడు. మంగళవారం వేకువజామున కరెంట్ మోటార్ పెట్టేందుకు పొలం వద్దకు వెళ్లాడు. ఫ్యూజులు, స్టార్టర్ డబ్బా కాలిపోయి విద్యుత్ వైర్లు విడిపోయి ఉన్నాయి. విషయం తెలియక మోటార్ ఆన్ చేసేందుకు బాక్స్ ముట్టుకోగానే విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ధర్మపురి: అతి వేగంగా.. అజాగ్రత్తగా కారు నడిపి ఓ యువకుడి మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన తొందుర్తి రాజేందర్ ధర్మపురిలోని వెంకటేశ్వర షాపులో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ధర్మపురి సమీపంలోని నర్సయ్యపల్లి స్టేజీ వద్ద ధర్మపురి నుంచి జగిత్యాల వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవుకు చెందిన తమ్మడి వినోద్ అజాగ్రత్తగా కారు నడిపి ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాజేందర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గంగరాజు ఫిర్యాదు మేరకు దీంతో డ్రైవర్ వినోద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

అయ్యో.. 'చేయూత' ఏదయా

- మార్చి నెల దాటినా ఖాతాకు పింఛన్ చేరలే
- వృద్ధులు, దివ్యాంగుల పడిగాపులు
- కొత్త అర్జీలకు కలగని మోక్షం



కరీంనగర్ అర్బన్: ప్రతి నెలా ఠంచన్‌గా రావాల్సిన చేయూత పింఛన్ నెల దాటినా దిక్కులేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రతి నెలా తొలివారంలోనే డబ్బులొచ్చేవి. క్రమేణా నెలాఖరుకు చేరగా తాజాగా నెల దాటినా పింఛన్ అలజడి లేకపోవడం ఆందోళనకర పరిణామం. పింఛన్‌పైనే ఆధారపడి జీవించే వృద్ధులు లేకపోలేదు. ఎప్పుడొస్తాయోనని ఎదురుచూసేవారు వేలల్లో ఉండగా పడిగాపులు అనివార్యమయ్యాయి. అధికారులను సంప్రదిస్తే డబ్బులు వస్తాయని చెబుతున్నారని, తీరా ఏప్రిల్ రావడంతో గందరగోళం నెలకొంది.

ఎందుకిలా..

జిల్లాలో ఆసరా పింఛన్ల కింద మొత్తం 1,23,041 మంది లబ్ధిపొందుతున్నారు. ప్రతి నెలా దివ్యాంగులకు రూ.4016, ఇతర పింఛన్లకు రూ.2016 చెల్లిస్తున్నారు. కాగా 6 నెలలుగా సకాలంలో పింఛను రాకపోవడంతో సంబంధిత కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. పింఛన్ కోసం బ్యాంకుకు వెళ్లడం రాలేదన్న సమాచారంతో నిరాశగా వెనుదిరగడం లబ్ధిదారుల వంతవుతోంది. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడో?

లబ్ధిదారుల సంగతి అటుంచితే కొత్త దరఖాస్తులు, పాత దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు. నాలుగేళ్లుగా కొత్త పింఛన్లు లేకపోగా ఇప్పుడు అప్పుడంటూ ప్రభుత్వ ప్రకటనల క్రమంలో అర్జీలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతుండగా మంజూరు మాటే లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా వేలమంది కొత్త పింఛన్ల కోసం నిరీక్షిస్తున్నారు. కొత్త పింఛన్లు ఇస్తామని సీఎం ప్రకటించగా నేటికి వాటి ఊసే లేదు. 57ఏళ్లు నిండినవారికి పింఛన్ ఇస్తామని గత ప్రభుత్వం వెసులుబాటు కల్పించగా వేలమంది దరఖాస్తు చేశారు. వాటి పరిశీలన ప్రక్రియ చేపట్టకపోగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొత్త పింఛన్లు సుమారు 20వేల వరకు వచ్చే అవకాశముండగా ఇంకా స్పష్టత లేకపోవడం ఆరోపణలకు తావిస్తోంది.

పెరగనున్న లబ్ధిదారులు

ఆసరా పింఛన్‌దారుల వయస్సు 57కు తగ్గించగా, గ్రామ, మండలస్థాయిలో పరిశీలించి జిల్లావ్యాప్తంగా 14వేలకు పైగా అర్హులు ఉన్నట్లు గుర్తించారు. దీనికితోడు కొత్త దరఖాస్తులు వేలల్లో ఉండగా అతీగతి లేదు. దివ్యాంగులకు రూ.4,016, ఇతర పింఛన్లకు రూ.2,016 చెల్లిస్తుండగా దరఖాస్తుల క్రమంలో పింఛన్లు చెల్లిస్తే లబ్ధిదారుల సంఖ్య 20వేలకు పైగా చేరుకోనుంది.

జిల్లాలో చేయూత మొత్తం లబ్ధిదారులు: 1,23,041
ఇందులో వృద్ధాప్య పింఛన్‌దారులు: 48,318
వితంతు: 34,229
దివ్యాంగులు: 20,702
గీతకార్మికులు: 3,767
చేనేత కార్మికులు: 2,817
ఒంటరి మహిళలు: 3,271
బీడీ కార్మికులు: 9,937

జిల్లాలో మండలాల వారీగా పింఛన్ తీసుకుంటున్నవారు..

మండలం	మొత్తం పింఛన్లు
చిగురుమామిడి	6,692
చొప్పదండి	7,527
ఇల్లందకుంట	4,574
గంగాధర	9,946
గన్నేరువరం	3,414
హుజూరాబాద్	6,352
హుజూరాబాద్‌అర్బన్	2,256
జమ్మికుంట	5,502
జమ్మికుంటఅర్బన్	2,599
కరీంనగర్‌రూరల్	5,458
కరీంనగర్‌అర్బన్	19,493
కొత్తపల్లి	6,512
మానకొండూర్	8,706
రామడుగు	8,281
సైదాపూర్	6,418
శంకరపట్నం	6,361
తిమ్మాపూర్	6,991
వీణవంక	5,959
మొత్తం	123,041

మందులకు పైసల్లేవు



ఎప్పుడైనా ప్రతి నెలా మొదటివారంలో పింఛన్ డబ్బులు వచ్చేవి. ఏమైందో కానీ కొన్ని నెలలుగా వచ్చే పింఛన్ అవసరానికి ఉపయోగపడటం లేదు. నెలాఖరుకు పింఛన్ వేస్తున్నారు. ఇప్పుడేమో అవీ దిక్కులేదు. ఇంకా మార్చి నెల డబ్బులు రాలే. ప్రతి నెల మందులు వాడాలి. ఇప్పుడేమో చేతిలో డబ్బులు లేవు.

– బి.మల్లారెడ్డి, హుజూరాబాద్

పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో..

- పూసాలకు చెందిన యువకుడి ఆత్మహత్య


లింగమూర్తి(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): తనకు వివాహం కావడం లేదనే మనస్తాపంతో పూసాల గ్రామానికి చెందిన నల్ల లింగమూర్తి(38) ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. లింగమూర్తి రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తాడు. ఐదేళ్లక్రితం తల్లిదండ్రులు చనిపోయారు. వీరు నలుగురు అన్నదమ్ములు. అందులో పెద్దన్న, మూడోఅన్నకు పెళ్లి అయ్యింది. లింగమూర్తి రెండో అన్నతో కలిసి ఉంటున్నాడు. ఈక్రమంలో తనకు పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో మార్చి 29న రాత్రి ఎలుకల మందు తాగాడు. మరుసటి తెల్లవారుజామున కడుపు నొప్పి తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి అన్న నల్ల రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

గొల్లపల్లి: అనారోగ్య కారణాలతో ఒకే రోజు ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్న ఘటన గొల్లపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం గొల్లపల్లికి చెందిన ఎనగందుల జయంతి(25)డిగ్రీ వరకు చదువుకుని ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుంది. గత కొంత కాలంనుంచి కడుపు నొప్పితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని ఇనుప రాడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

బావిలోకి దూకి వృద్ధురాలు..

మండలంలోని గోవిందుపల్లి గ్రామానికి చెందిన బింగి వెంకటమ్మ(72)గత కొనేళ్లుగా థైరాయిడ్, షుగర్ తో బాధపడుతోంది. ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- బంగారు నగలు, వాహనాలు స్వాధీనం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ఓ మహిళ ఇంట్లో చోరీకి పాల్పడి బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్లిన కేసులో ఇద్దరు మైనర్ నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. కొదురుపాక గ్రామంలో గతనెల 28న సట్ల జలజ అనే మహిళ కోడిగుడ్లు తీసుకరావడానికి ఇంటికి గడియ పెట్టి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోని బంగారు, వెండి నగలు ఎత్తుకెళ్లారన్నారు. ఈ విషయమై ఆమె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రెండు టీంలుగా ఏర్పడి టెక్నికల్ ఎవిడెన్స్, సీసీ ఫుటేజీల ఆధారంగా కరీంనగర్‌కు చెందిన ఇద్దరు మైనర్ యువకులతో పాటు ప్రవళిక, అంజయ్య అనే భార్యభర్తలను పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి నాలుగున్నర తులాల బంగారు నగలు, రెండు జతల వెండి పట్టగొలుసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరి నుంచి రెండు బైక్‌లు, వెల్డింగ్ మిషన్ స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

దంపతుల ప్రోత్సాహంతో..

బైక్‌లు ఎత్తుకెళ్లడం లాంటి దొంగతనాలు చేసే కరీంనగర్‌కు చెందిన మైనర్ యువకులు ఆ వాహనాలను ప్రవళ్లిక-అంజయ్య దంపతులకు కరీంనగర్‌లో విక్రయించేవారని పోలీసులు తెలిపారు. కాగా చిన్న దొంగతనాలు ఎన్ని రోజులు చేస్తారని పెద్ద దొంగతనాలు చేయాలని ప్రవళ్లిక అంజయ్యలు ప్రోత్సహించడంతో బంగారు నగలు చోరీకి పాల్పడ్డట్లు పేర్కొన్నారు.

లాభాల బాటలో ఆర్‌ఎఫ్‌సీఎల్


ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం

- ఉత్పత్తి లక్ష్యం 12.74 లక్షల మెట్రిక్ టన్నులు
- సాధించింది 11,94,921.17 మెట్రిక్ టన్నులు
- వార్షికాదాయం అంచనా సుమారు రూ.510 కోట్లు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్) కర్మాగారం లాభాల బాటలో పయనిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత 12.7 లక్షల మెట్రిక్ టన్నులకు 11,94,921.17 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసి సుమారు రూ.510 ఆదాయం సమకూర్చుకుంది. ప్లాంట్ సామర్థ్యం రోజూ 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తోంది.

ఏడు రాష్ట్రాలకు సరఫరా..

అర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి చేసిన యూరియాను తెలంగాణతోపాటు 7 రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. తెలంగాణకు 4,68,954.76 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 1,78,363.39 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 1,91,288.07 మెట్రిక్ టన్నులు, మహారాష్ట్రకు 82,986.39 మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 60,640.38 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 1,01,520.99మెట్రిక్ టన్నులు, మధ్యప్రదేశ్‌కు 1,11,167.19 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారు.

లక్ష్యానికి దూరంగా ఉన్నా..

ఆర్‌ఎఫ్‌సీఎల్ 2024–25 ఆర్థిక సంవత్సరంలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేయాల్సి ఉంది. కానీ, 11,94,921.17 మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేశారు. కర్మాగారంలో నెలకొన్న సాంకేతిక సమస్యలతో దాదాపు 75,078.83 మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా ఉత్పత్తి చేశారు. ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం చేరుకోలేకపోయినా.. లాభాలు ఆర్జిస్తోంది.

లాభాలు ఇలా..

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 22 మార్చి 2022లో నీమ్ కోటెడ్ యూ రియా ఉత్పత్తి ప్రారంభించారు. దీంతో 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.15.23 కోట్లు, 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.440.96 కోట్లు, 2024–25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.510 కోట్ల ఆదాయం సాధించారు.





రాజన్నకు సెలవుల రద్దీ

వేములవాడ: ఎములాడ రాజన్నకు వరుస సెలవుల రద్దీ పెరిగింది. మంగళవారం 20 వేల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్ది పోచమ్మకు బోనం, ఒడి బియ్యం, కల్లుసాక, సమర్పించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.

'ఎల్లంపల్లి'లో తగ్గుతున్న నీటిమట్టం

- అప్రమత్తమైన హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు


రామగుండం: పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం సగానికి పడిపోయింది. దీంతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్, సీవరేజీ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్) అధికారులు అప్రమత్తమయ్యారు. వచ్చే మే చివరి నాటికి ప్రాజెక్టు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. తద్వారా హైదరాబాద్‌కు తాగునీరు పంపింగ్ చేసే విద్యుత్ మోటార్లకు సరిపడా నీరు అందకుండా పోతుందని భావించిన అధికారులు.. ప్రత్యామ్నాయ చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

హైదరాబాద్‌కు రోజూ సరఫరా..

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ మహా నగరానికి రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లిలో పంపుహౌస్ నిర్మించారు. ఒక్కోటి 6.6 కేవీ సామర్థ్యం గల ఆరు విద్యుత్ మోటార్లతో రోజూ సుమారు 56 క్యూసెక్కులను హైదరాబాద్‌కు పంపింగ్ చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 148 మీటర్లు. 138.3 మీటర్ల స్థాయికి నీటిమట్టం పడిపోతే పంపుహౌస్‌లోని విద్యుత్ మోటార్లకు నీరు అందకుండా పోతోంది. తద్వారా పంపింగ్ నిలిచిపోతుంది.

నీటిమట్టం 143.47 మీటర్లు

నీటిపారుదలశాఖ శాఖ అధికారులు మంగళవారం వెలడించిన వివరాల ప్రకారం.. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్లు కాగా ప్రస్తుతం 143.47 మీటర్లు ఉంది. 9.75 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదేరోజు 142.28 మీటర్ల నీటిమట్టం ఉంటే 7.84 టీఎంసీల నిల్వ ఉంది. దీంతో గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ అధికారులు.. నీటిని ఎత్తిపోసేందుకు 125 హెచ్‌పీ సామర్థ్యం గల 25 మోటార్లను సిద్ధం చేస్తున్నారు.


ఎల్లంపల్లి ప్రాజెక్టులో సగానికి పడిపోయిన నీటిమట్టం

సమీక్షిస్తున్నాం

ఎల్లంపల్లి ప్రాజెక్టులో గతేడాదితో పోల్చితే ప్రస్తుతం నీటిమట్టం ఆశాజనకంగానే ఉంది. 138.3 మీటర్లకు నీటిమట్టం పడిపోతేనే పంపింగ్ కోసం ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 143.47 మీటర్లు ఉంది. హైదరాబాద్ వాసులకు తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు అధికారులతో సమీక్షిస్తున్నాం.

– వెంకటేశ్, డీజీఎం, హెచ్‌ఎండబ్ల్యూఎస్

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో మంగళవారం సాయంత్రం సీసీఎస్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అంతర్గాం గ్రామానికి చెందిన నాగశెట్టి స్వామి అలియాస్ సన్ని ఇంట్లో తనిఖీలు చేపట్టగా.. 130 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఆ గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రూరల్ పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేశ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలకు 'లక్ష్మీ' కటాక్షం

- ధాన్యం సేకరణతో రూ.20.69 కోట్ల ఆదాయం
- మొదటి స్థానంలో ధర్మపురి, చివరిస్థానంలో ఇబ్రహీంపట్నం


గ్రామాల్లోని కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు


జగిత్యాల మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చిన పసుపు పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లా. సాగునీటి వనరులు పుష్కలంగా ఉండటంతో గతేడాది అన్ని పంటలు పుష్కలంగా పండాయి. రైతులతోపాటు మార్కెట్ కమిటీలకూ భారీగా ఆదాయం సమాకూరింది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీలు 2024–25 ఆర్థిక సంవత్సరంలో 'లక్ష్మీ' కటాక్షంతో కళకళలాడుతున్నాయి. జిల్లాలో లక్ష్యాన్ని మించి అత్యధికంగా ఆదాయం సంపాదించిన దాంట్లో మొదటి స్థానంలో ధర్మపురి మార్కెట్ నిలిచింది. చివరి స్థానంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నిలిచింది.

జిల్లాలో 13 వ్యవసాయ మార్కెట్ కమిటీలు

జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, పెగడపల్లి, వెల్గటూర్, రాయికల్ ఇలా మొత్తం 13 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ మార్కెట్ యార్డులకు రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కొనుగోలు చేసిన వ్యాపారులు ఉత్పత్తుల విలువపై ఒక శాతం ఫీజును మార్కెట్ కమిటీలకు చెల్లిస్తుంటారు. గ్రామాల్లో నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసినా ఆ వ్యాపారులు కూడా సంబంధిత మార్కెట్‌కు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వ్యాపారులే కాకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సివిల్ సప్లై, మార్క్‌ఫెడ్ వంటి సంస్థలు కూడా ఫీజు చెల్లిస్తుంటాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వ సంస్థలు రైతుల నుంచి ధాన్యం, మొక్కజొన్న, కందులు, మినుములు, శనగలు వంటివి కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ ఫీజు చెల్లించడం కొంచెం ఆలస్యమైనా భారీగానే ఆదాయం వస్తోంది.

రికార్డు స్థాయిలో ఉత్పత్తితోనే ఆదాయం

జిల్లాలో ప్రతి సీజన్‌లో కనీసం 5 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తుంటారు. ఇందులో 3 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. వానాకాలం, యాసంగి సీజన్‌లోనే దాదాపు 10 నుంచి 12 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. మొక్కజొన్న కూడా రెండు సీజన్లలో కలిపి దాదాపు 5 నుంచి 6 లక్షల క్వింటాళ్లు దిగుబడి అవుతుంది. కందులు, పెసర్లు, అలిసంద, నువ్వులు, పత్తి, పసుపు వంటి ఉత్పత్తులు అమ్ముతుంటారు. కొన్నేళ్లుగా జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల మార్కెట్ కమిటీలకు మామిడి కాయల అమ్మకం ద్వారా మార్కెట్ ఫీజు బాగానే వస్తోంది. ఇతర జిల్లాల్లో రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పటికీ అక్కడ మార్కెట్ ఫీజు చెల్లించలేదంటే.. చెక్‌పోస్టుల ద్వారా కూడా ఫీజు వసూలవుతుంది.

లక్ష్యాన్ని మించి ఆదాయం

ఐదేళ్లలో సాధించిన ఆదాయం ప్రకారం జిల్లాలోని మార్కెట్ కమిటీలకు ఏటా లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. జిల్లాలోని 13 మార్కెట్ కమిటీల్లో జగిత్యాల, ధర్మపురి, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, పెగడపల్లి, వెల్గటూర్, రాయికల్ మార్కెట్‌లు మాత్రమే లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని అర్జించాయి. జిల్లాలో రూ.15.98 కోట్ల లక్ష్యానికి రూ.20.69 కోట్ల ఆదాయాన్ని(129.47 శాతం)సాధించాయి. రాబోయే ఏడాదిలోనూ మంచి ఆదాయాన్ని సంపాదించేందుకు మార్కెట్ కమిటీలు ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

జిల్లాలోని మార్కెట్ కమిటీల లక్ష్యం, ఆదాయం (రూ.కోట్లలో..), శాతం

మార్కెట్ కమిటీ	లక్ష్యం	ఆదాయం	శాతం
జగిత్యాల	2.61	2.79	106.71
మెట్‌పల్లి	1.75	1.31	74.90
కోరుట్ల	1.47	1.01	68.80
గొల్లపల్లి	8.8	8.4	95.86
ధర్మపురి	1.81	4.86	267.45
మల్యాల	1.62	3.56	220.14
కథలాపూర్	1.05	1.25	119.76
మేడిపల్లి	9.3	11.6	124.37
మల్లాపూర్	7.0	8.3	105.01
ఇబ్రహీంపట్నం	4.6	3.4	74.19
పెగడపల్లి	7.5	8.4	111.74
వెల్గటూర్	1.12	1.12	100.52
రాయికల్	6.9	7.2	103.81
మొత్తం	15.98	20.69	129.47

మార్కెట్లలో వసతులు కల్పించాలి



జిల్లాలోని అన్ని మార్కెట్‌లలో సరైన వసతులు కల్పించాలి. రైతులకు విశ్రాంతి భవనాలు నిర్మించాలి. మంచి నీటి సదుపాయాలు, మూత్రశాలలు సరిగ్గా లేవు. రైతుల ఉత్పత్తుల అమ్మకం ద్వారా మార్కెట్‌లకు వచ్చే అదాయాన్ని అభివృద్ధికే ఖర్చు చేయాలి.

– వేముల కర్ణాకర్‌రెడ్డి, తీగలధర్మారం, ధర్మపురి మండలం

ఆదాయం సంపాదించాం



జిల్లాలోని అన్ని మార్కెట్లలో లక్ష్యాన్ని మించి 129.47 శాతంతో ఈ ఏడాది రూ 20.69 కోట్ల ఆదాయాన్ని సాధించాం. మార్కెట్ ఫీజును కచ్చితంగా వసూలు చేయడంతోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించాం. ఈ మేరకు అయా మార్కెట్లలోని మార్కెట్ సిబ్బంది రాత్రిబవళ్లు పనిచేస్తున్నారు.

– ప్రకాష్, మార్కెటింగ్ అధికారి, జగిత్యాల